www.aksharadarbar.com
మంగళవారం 01, అక్టోబర్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :202 | పేజీలు : 06 | వెల : 05

హైడ్రా పేదల జోలికి రావద్దు

- వస్తే ఎర్రజెండా అండగా ఉంటుంది
- చెరువులు, కుంటలను ఆక్రమించిన పెద్దల కట్టడాలు కూల్చాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- వరంగల్‌లో ఇండ్లను క్రమబద్ధీకరించాలని సదస్సు

05

- ఆయన పనిచేసిన ప్రతీ చోటా అక్రమాల చిట్టా
- కాజీపేటలో మూడున్నర ఎకరాల భూమిని ఓ వ్యక్తికి కట్టబెట్టిన వైనం
- డీల్ కుదుర్చుకొని రికార్డులో భూమి హక్కుదారుడి పేరు తొలగింపు
- నకిలీ డాక్యుమెంట్లతో పని కానిచ్చేసిన అధికారి
- ప్రస్తుతం మార్కెట్లో ఆ భూమి విలువ రూ.కోట్లు
- న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితుడు

పేరు తొలగించి రికార్డు సృష్టించి!

అక్రమార్జనే లక్ష్యంగా రెవెన్యూ శాఖలో ఓ అధికారి విధులు

రెవెన్యూ శాఖలోని కొందరు అధికారులు అక్రమార్జనే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో అందిన కాడికి దండుకునేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. తర్వాత స్వప్రయోజనాల కోసం బరితెగిస్తూ తమ అధికారాన్ని అక్రమ సంపాదనకు వినియోగిస్తున్నారు. తమను సంప్రదించిన వ్యక్తులతో డీల్ కుదుర్చుకుని 'తమ రూటే సప'రేట్' అనే రీతిలో అక్రమాలకు ఒడిగడుతున్నారు. అవసరమైతే బతికే ఉన్న వ్యక్తులను రికార్డుల్లో చనిపోయినట్లుగా పేర్కొని ఒకరి భూమిని మరొకరికి కట్టబెడుతున్నారు. లేదా డూప్లికేట్ డాక్యుమెంట్లు, రికార్డులు గాని సృష్టించి భూముల హక్కుదారుల మార్పిడిలో టార్గెట్ రీచ్ అవుతున్నారు. ఎక్కడ పనిచేసినా అవగాహనతో రెవెన్యూ 'లీల'ల్లో ఓపెన్ గా పోటీ పడుతున్నారు. ఒక్కో లీల ద్వారా అక్రమార్కులను సంతృప్తిపరిచి దర్జాగా రూ.లక్షలు గడిస్తున్నారు. ఇదే పనిగా తమదైన ప్రత్యేకత చాటుతూ అక్రమాల ద్వారా రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై నెత్తి నోరు బాదుకుంటూ రెవెన్యూ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. న్యాయం కోసం ఉన్నతాధికారులను వేడుకుంటున్నా అనేక మందికి ఫలితం దక్కడం లేదు. తాజాగా హనుమకొండ జిల్లాలో ఇలాంటిదే ఒకటి వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ శాఖ అధికారి ఒకరు కాజీపేట మండలంలో రికార్డుల్లో మార్పులు చేసి ఏకంగా మూడున్నర ఎకరాల భూమిని తనతో డీల్ కుదుర్చుకున్న ఓ వ్యక్తికి కట్టబెట్టారు. కాజీపేట జాగీర్ పరిధిలోగల రూ.కోట్ల విలువైన ఈ భూమికి సంబంధించిన హక్కుదారుడి పేరును రెవెన్యూ రికార్డుల్లో తొలగించటం ద్వారా పని కానిచ్చేశాడు. తనను సంప్రదించిన వ్యక్తికి నకిలీ డాక్యుమెంట్స్ తో మూడున్నర ఎకరాల భూమికి హక్కులు కల్పించేశాడు. మహా నగరంలో ఈ భాగోతం ఎప్పుడు జరిగింది?, ఇందులో అధికారి డీల్ ఎంత?, మూడున్నర ఎకరాల భూమి హక్కు దారుల మార్పు ఎలా జరిగింది? అనే పూర్తి వివరాలు రేపటి సంచికలో... - అక్షరదర్బార్, నిఘావిభాగం

మరిన్ని కథనాలు రేపటి సంచికలో

బిడ్డా వినయ్ తీరు మార్చుకో..

- నీ బతుకంతా కబ్జాలు, వసూళ్లు, గూండాగిరి
- అన్న పేరుతో రాజకీయ పబ్బం గడిపిన చరిత్ర నీది..
- నీ వికృత చేష్టల వల్లే ప్రణయ్‌భాస్కర్ కుటుంబం ఆగమైంది
- నేను నోరు విప్పితే నిన్ను పార్టీలో ఉంచరు
- నా ఫోన్ తెరిస్తే నీకు శంకరగిరి మాన్యాలు తప్పదు
- నీ వ్యక్తిగత జీవితం దెబ్బకొట్టొద్దని చూస్తున్నా...
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై నిప్పులు..

04

కేయూలో కలకలం

వర్సిటీలో విజిలెన్స్ అధికారుల దాడులు

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలు, సీఐ రాకేష్ ఆధ్వర్యంలో సోదాలు
- రిజిస్ట్రార్ మల్లారెడ్డి గాయబ్..
- గతంలోనూ నోటీసులకు స్పందించని వైనం
- కీలకమైన ఫైళ్ళు ఇవ్వడంలో జాప్యం
- నేరుగా యూనివర్సిటీకి వచ్చిన అధికారుల బృందం

06

రక్తాన్ని తాగేస్తున్న వడ్డీ వ్యాపారులు

- పరువు గల వ్యక్తులే వారి టార్గెట్

కాటారంలో వడ్డీ జలగలు!

- వెయ్యికి రూ.10, 20ల చొప్పున అధిక వడ్డీ వసూలు
- ఒక్కరోజు లేటైనా బాధితులకు బెదిరింపులు
- మితిమీరుతున్న వడ్డీ వ్యాపారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

02

కాటారంలో వడ్డీ జలగలు!

- రక్తాన్ని తాగేస్తున్న వడ్డీ వ్యాపారులు
- పరువు గల వ్యక్తులే వారి టార్గెట్
- వెయ్యికి రూ.10, 20ల చొప్పున అధిక వడ్డీ వసూలు
- ఒక్కరోజు లేటైనా బాధితులకు బెదిరింపులు
- మితిమీరుతున్న వడ్డీ వ్యాపారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

అక్షర దర్బార్, కాటారం :

పరువు కోసం తల్లడిల్లే వ్యక్తులే వారి టార్గెట్.. ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలపైనే వారి నజర్.. సామాన్యుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొందరు వడ్డీ వ్యాపారులు జలగల్లా సామాన్య మనషుల రక్తాన్ని పీల్చేస్తున్నారు. వీరి ధాటికి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతుండగా పలువురు పరువు పేరుతో ఆత్మహత్యలకు పాల్పడు తున్న ఘటనలు లేకపోలేదు. ఇంత జరుగుతున్న వడ్డీ వ్యాపారులు మాత్రం మాకేం కాదులే అంటూ భింకం ప్రదర్శిస్తున్న తీరు కాటారం సబ్ డివిజన్ మండలాల్లో చర్చయనీయాంశమవుతున్నది. తెలంగాణ వడ్డీ వ్యాపార చట్టం (మనీ ల్యాండరింగ్ యాక్ట్) ప్రకారం చట్టంలోని 11(ఇ) నిబంధనలు పాటించాల్సి ఉంటుండగా చట్టం మాకు గిట్టదంటూ వడ్డీ జలగలు సామాన్యుల రక్తాన్ని తాగేస్తున్నాయి. ముఖ్యంగా కాటారం సబ్డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవ పూర్,మల్హర్, మహాముత్తారం మండలాల్లో వడ్డీ వ్యాపారులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తుండగా వారి ఆగడాలు శృతిమించిపోతున్నాయి. ప్రజల ఆర్థిక అవ సరాలు, తాగుడుకు, జూదానికి బానిసైన వ్యక్తులనే టార్గెట్ చేసుకుని అడ్డగోలుగా అదిక వడ్డీ వసూలు చేస్తుండగా అమాయకులు ఆస్తులు అమ్ముకుంటూ రోడ్డున పడుతున్న దుస్థితి ఏర్పడుతున్నది. అధిక వడ్డీ వ్యాపారులను నియత్రించాల్సిన సంబంధిత శాఖ అధి కారులు మాత్రం కౌన్సిలింగ్ల పేరుతో నామమాత్రపు వార్నింగ్లు ఇస్తూ పరోక్షంగా వడ్డీ వ్యాపారులను ప్రోత్స హిస్తున్నారనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి.

- బతుకు బండిపై గిరిగిరి కత్తి

కాటారం సబ్ డివిజన్ మండలాల్లో చిరు వ్యాపారులైన బజ్జీ బండ్లు, పానీ పూరి బండ్లు, చికెన్ షాపులు, బార్బర్ షాపులు, కూరగాయల షాపుల నిర్వాహకులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకుంటున్నారు. దీంతో చిరువ్యాపారుల అవసరాలను బట్టి వడ్డీ వ్యాపారులు ఒక్కొక్కరూ ఒక్కోరకంగా అధిక వడ్డీలను వసూలు చేస్తున్నారు. చిరు వ్యాపారులంతా ఏ రోజుకారోజు జరిగే వ్యాపారం మీద ఆధారపడి జీవిస్తుండగా గిరిగిరి ఇచ్చే వ్యక్తులను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటు న్నారు. ఉదయం 900 ఇస్తే సాయంత్రానికల్లా రూ.1000 అని, మరికొందరైతే రూ.9వేలు ఇచ్చి పది వారాలకు పదివేలు తీసుకుంటూ సొమ్ముచేసుకుంటు న్నారు. ఫైనాన్స్ కట్టకుండా ఒక్కరోజు లేటైనా నిర్వా హకులు షాపుల మందుకు వచ్చి గొడవలకు దిగుతుం డగా వారి భయానికి షాపులు తెరవకుండా ఇంట్లోనే ఉంటున్న దాఖలాలు లేకపోలేదు. వీరి ఆగడాలు రోజు రోజుకు ఎక్కువవుతుండగా మాకిచ్చే వారే లేరని ఇప్పటి పరిస్థితి ఇప్పటిదని ఎంత వడ్డైనా పర్లేదని చిరు వ్యాపారులే వారికి అండగా నిలుస్తుండడం విశేషం.

- వ్యాపారులకే వత్తాసు

కాటారం సబ్ డివిజన్లో సామాన్యులను అధిక వడ్డీ వ్యాపారులు జలగల్లా పీడిస్తుండగా సంబంధిత అధికా రులు వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నట్లు ఆరోప ణలు చక్కర్లు కొడుతున్నాయి. వడ్డీ వ్యాపారులను క్రమంలో పెట్టాల్సింది ఉండగా నామమాత్రమైన కౌన్సిలింగ్ల పేరుతో వార్నింగ్లు ఇస్తూ చేతులు దులుపు కుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మనీ లాండరింగ్ అతిక్రమణ చట్టం ప్రకారం అధిక వడ్డీ తీసుకుంటున్నట్లు నేరం నిరూపణ అయితే వారిపై కేసులు పెట్టి కటకటాల్లోకి నెట్టెయ్యాల్సింది ఉంటుంది. కాగా అవేం తమకు పట్టవంటూ సంబంధిత అధికా రులు మిన్నకుండిపోతున్నారని ఇక్కడంతా వారికి మామూలేనని పలువురు పలు రకాలుగా మాట్లాడు కుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికా రులు వడ్డీ వ్యాపారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని కాటారం సబ్ డివిజన్ ప్రజానికం కోరుతున్నారు.

వెయ్యికి రూ.10-20 వడ్డీ

కాటారం మండలకేంద్రంతో పాటు మహదేవపూర్ మండలంలోని మహదేవపూర్, సూరారం, బొమ్మాపూర్, కాళేశ్వరం గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల ధన దాహానికి అమాయకులు బలవుతున్నారు. కాటారం మండలకేంద్రంలో జై శ్రీరాం అంటూనే ఓ వ్యక్తి, మటన్, చికెన్ షాపులు నిర్వహించే ఇద్దరు వ్యక్తులు, గిరి గిరి పేరుతో ఓ మహిళతో పాటు మరి కొంతమంది వ్యక్తులు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు వెయ్యికి రూ.10,20 చొప్పున అధిక వడ్డీల వసూల్ చేస్తూ లక్షలు గడిస్తున్నారు. వీరంతా వడ్డీ, గిరిగిరి పేరుతో రోజు, వారం, నెలవారి కలెక్షన్ల పేరుతో చిరు వ్యాపారుల వద్ద వడ్డీ తీసుకుంటూ నడ్డి విరుస్తున్నారు. సమయానికి వడ్డీ పైసలు అందించకపోయారో ఇక అంతే సంగతి.. తెల్లారే ఇంటి మందుకొచ్చి గొడవలు పెడుతున్నారు. దీంతో ఎక్కడ ఇళ్ల వద్దకు వస్తారోనని కొందరు ఊళ్లు వదిలి వెళ్లిపోతున్న పరిస్థితులు అనేకం. అలాగే మహదేవపూర్ మండలంలో సూరారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కార్లు కుదవ పెట్టుకుని డబ్బులు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తుండగా అసలు, వడ్డీలు కట్టలేక కార్లను వారికే వదిలిపెడుతున్న సంఘటనలు ఉంటున్నాయి. మహదేవపూర్లో ఓ ఫర్టిలైజర్ షాపు యజమాని బంగారం కుదవ పెట్టుకుని అధిక వడ్డీ వసూలు చేస్తుండగా ఇటీవల అతని ఇంట్లో రైడింగ్ సైతం జరిగింది. కాటారంలో మటన్షాపు నడిపే ఓ వ్యక్తి బైకులు కుదవ పెట్టుకుని అధిక వడ్డీకి ఇస్తుండగా వారి ఇంటిని తనిఖీ చేసిన పోలీసులు ఇంటి వద్ద ఉన్న బైకులను చూసి ఆశ్చర్యపోయారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

అక్షర దర్బార్, నర్సంపేట : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాలాజీ స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం బాలాజీ స్కూల్ ఆవరణలో జరిగిన సమావే శంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 28 నుండి 30 వరకు నర్సంపేటలోని మినీ స్టేడియంలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో కబడ్డీ అండర్ 17 గర్ల్స్ విభాగంలో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.సంజన, ఎం.యువరాణి, జి.దీపిక, బి.రాజన్న, ఎం.శివశ్యాం జిల్లా స్థాయికి ఎంపిక కాగా, అండర్ 14 కబడ్డీలో ఎం. సాయి చరణ్ ఎంపిక య్యారు. వాలీబాల్ అండర్ 17 విభాగంలో బి.రాజేష్, అండర్ 14 విభాగంలో బి. తరుణ్ ఎంపికైనట్లు తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీ.ఈ.టీ.లు బి. రవీందర్ రెడ్డి, రచ్చ భవానీ చంద్, వినోద్, సందీప్, పార్వతి, సుమలత, శ్రీకాంత్, గోపీ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన మోక్షిత్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన పల్లెర్ల విద్యాసాగర్ గీతదేవి కుమారుడు మోక్షిత్ కుమార్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబర్చి సింగరేణి ఇనిస్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీ రామ గుండంలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు. కడు పేదరికా నికి చెందిన మోక్షిత్ చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి వైద్య విద్యలో సీటు సంపాదించి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చాడు. ఆయనను గ్రామస్తులు అభినం దించారు.

అంగట్లో సరుకులా 'బయో' మందులు

- బహిరంగంగా విక్రయిస్తున్న వ్యాపారులు
- అయోమయంలో రైతాంగం
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు
- చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

అక్షర దర్బార్,మహాదేవపూర్ : మండలంలో బయో ఫెర్టిలై జర్ అంగట్లో సరుకులా వీధుల్లో తిరుగుతూ రైతుల ఇంటి వద్దకు వెళ్లి అమ్ముతున్నారు. ఈ ఫర్టిలైజర్ మంచిదా లేక చెడ్డదా అని తెలియక రైతాంగం అయోమయంలో పడుతోంది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం మండలం లోని అంబటిపల్లి గ్రామంలో విజయ బయోటెక్ ఫర్టిలైజర్ అంటూ రైతుల వద్దకు వెళ్లి వాహనంలో ఫర్టిలైజర్ను అమ్ము తుండగా గ్రామంలో కొంతమంది రైతులు వాహనాన్ని ఆపి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా వెంటనే ఆ వాహనాన్ని విపరీతమైన వేగంతో వెళ్లిపోయాడని గ్రామస్తులు ఆరోపించారు. ఇలా రైతులను మోసం చేసే ఎరువులను ఆయా గ్రామాల్లో రైతులు తెలియక కొని మోసపోతున్నారని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో బయో మందుల పేరుతో రైతులను మోసగిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ శాఖ అశ్రద్ధ వల్లనే ఇలాంటి వారు గ్రామాల్లో బహిరంగంగా ఎరువులను పురుగు మందులను అమ్ముతున్నారని ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఎరువులు, పురుగుమందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతుంది.

అక్షర స్కూల్లో బతుకమ్మ పండుగ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్

కాటారం ఆదర్శ పాఠశాలలో

శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో..

పాఠశాలల్లో అలరించిన బతుకమ్మ వేడుకలు

మహదేవపూర్ లో..

బాలాజీ లో బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న చైర్మన్

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో ముందస్తు పూల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో పెద్ద బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్, ఉపాధ్యాయులు వినయ్, విజయ్, రజినీకాంత్, సురేష్, ప్రసాద్, లింగారెడ్డి, మహేష్ , అనురాగ్, అనూష, గీత, లావణ్య, మానస, నవ్య స్ఫూర్తి, సింధుజ, కిర్పాల్ కౌర్, రాధిక, రజిని పాల్గొన్నారు.

అక్షర స్కూల్లో..

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని అక్షర టెక్నో స్కూల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అండ్ర రాజేంద్రప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి భవానీ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ స్కూల్లో

మండలంలోని లక్నేపల్లి బాలాజీ టెక్నో స్కూల్లో మినీ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మ ముందు కోలాటం ఆడారు. బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అండ్ర రాజేంద్రప్రసాద్ రెడ్డి, కోశాధికారి వనజ, ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేద స్కూల్లో..

అక్షర దర్బార్, పరకాల : శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలోని శ్రీవేద పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవ పండుగ బతుకమ్మ అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, వేద, కీర్తి రెడ్డి, సల్మా తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ లో..

అక్షర దర్బార్, మహాదేవపూర్: మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నరసయ్య మాట్లాడుతూ పూలనే దేవతలుగా పూజించటం తెలంగాణ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి రమేష్. హెచ్ఎం సరిత పాల్గొన్నారు.

ఆదర్శలో..

అక్షర దర్బార్, కాటారం: కాటారం మండలకేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ లో మంగళవారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాలు అలరించాయి.. విద్యార్థినిలు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ బతుకమ్మలకు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత, పాల్గొన్నారు..

శ్రీవేద పాఠశాలలో..

శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో..

అక్షర దర్బార్,కేసముద్రం : మండలంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల మధ్య విద్యార్థులు చప్పట్లు కొడుతూ ఆడి పాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, గడ్డమీది నవీన్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్న రేవంత్ సర్కార్

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

అక్షర దర్బార్,కాటారం : కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం రేవంత్రెడ్డి పాలన తెలంగాణ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నదని ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేరని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు రైతులందరికి రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డీ తో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ మీటింగ్లో పాల్గొన్న సీఎం రేవంత్రెడ్డి రైతులందరికి రుణమాఫీ చేస్తున్నం మాజీ మంత్రి హరీష్రావు ఇక రాజీనామా చేయి అంటూ మాట్లాడారని, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండానే గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రేవంత్రెడ్డి ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్కు రుణమాఫీపై వినతిపత్రం ఇస్తామని తెలిసి జిల్లాలోని అనేక మంది రైతులు తరలివచ్చారని, ఏక్కేటి రాజయ్య అనే రైతు వచ్చిన తన రూ.35వేల రుణం మాఫీ కాలేదని చెప్తున్నాడని, దీనికి ఏమని సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. ఆనాడు దేవుళ్లపై ఒట్లు పెట్టుకుని రైతులందరికి రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అనేక మంది రైతులకు రుణమాఫీ చేయాలేదన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ వర్గానికి అన్యాయం జరుగకుండా పరిపాలన జరిగిందని, అలాంటి పాలనలో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి అధికారంలోకి వచ్చిన చరిత్ర కాంగ్రెస్పార్టీదేనన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్రెడ్డి కళ్లు తెరిచి ప్రజలకష్టాలను గుర్తించాలని ఆయన హితవుపలికారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

బిడ్డా వినయ్..
తీరు మార్చుకో..

- నీ బతుకంతా కబ్జాలు, వసూళ్లు, గూండాగిరి
- అన్న పేరుతో రాజకీయ పబ్బం గడిపిన చరిత్ర నీది..
- నీ వికృత చేష్టల వల్లే ప్రణయ్‌భాస్కర్ కుటుంబం ఆగమైంది
- నేను నోరు విప్పితే నిన్ను పార్టీలో ఉంచరు
- నా ఫోన్ తెరిస్తే నీకు శంకరగిరి మాన్యాలు తప్పదు
- నీ వ్యక్తిగత జీవితం దెబ్బకొట్టొద్దని చూస్తున్నా...
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై నిప్పులు..

అక్షరదర్బార్, హన్మకొండ: బిడ్డా తీరు మార్చుకో.. నీ బతుకంతా కబ్జాలు, వసూళ్లు, గూండాగిరీనే.. అన్న పేరుతో పబ్బంగడిపిన చరిత్ర నీది.. నీ వికృత చేష్టల వల్లే ఈ రోజు ప్రణయ్‌భాస్కర్ కుటుంబం ఆగమైంది.. నేను నోరు విప్పితే నిన్ను పార్టీలో కూడా ఉంచరు.. నా ఫోన్ తెరిస్తే నీకు శంకరగిరి మాన్యాలు తప్పదు అంటూ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ పై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిప్పులుచెరిగారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం అన్నారు. బీసీ ఐక్యత అంటున్న నువ్వు నీ చుట్టూ ఒక్కరన్న బీసీలను ఎదగనిచ్చావా అంటూ ఫైర్ అయ్యారు. తాను రెడ్డి అయినా చుట్టూ మొత్తం బీసీ నేతలే ఉంటారు చూడు అన్నారు. నా దగ్గర అన్నికులాల వాళ్ళు ఉన్నారు .. కానీ నీ దగ్గర కబ్జాల కులం, దోపిడీ కులం, గుండాల కులం మాత్రమే ఉందన్నారు.

కబ్జాచేసిన భూములు తిరిగి ఇచ్చేయాలి

10 ఏళ్ల తెలంగాణ ఉత్సవాలకు ఆహ్వానం వస్తే కుటుంబంతో తాను ఆస్ట్రేలియా పర్యటనకు పోయిన మాట వాస్తవమే అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనకు నన్ను ఆహ్వానించింది నీ కవితక్క మాజీ శిష్యుడు, నీ బాధితుడు కొరబోయిన విజయ్ అన్నారు. ఇప్పటికైనా వినయ్‌భాస్కర్ తీరు మార్చువాలని, కబ్జాలు చేసిన భూములను తిరిగి ఇచ్చేయాలన్నారు. నీ వ్యక్తిగత జీవితం దెబ్బకొట్టొద్దని చూస్తున్నానని, నా ఫోన్ తెరిస్తే నీ బ్రతుకు శంకరగిరి మాన్యాలే గుర్తుపెట్టుకో అంటూ ఘాటుగా హెచ్చరించారు. నా సహనాన్ని పరిక్షించకు, నేను నోరు విప్పితే నిన్ను పార్టీలో ఉంచరు యాదుంచుకో అంటూ ఫైరయ్యారు. వినయ్ అండ్ కో టీం ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవుపలికారు. తన దగ్గర ప్రత్యక్ష ఆధారాలు ఉన్నాయని, మీరు ఎవరిని, ఎక్కడ బెదిరించారో, ఎవరి భూములను లాక్కున్నారో అన్ని తెలుసన్నారు. అసలు ఏమిచేయని నయింనగర్ బ్రిడ్జి పనులను నేను చేసిన అని చెప్పుకోవడం నీ రాజకీయ విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.

కూల్చింది నీ అనుచరులే..

గతంలో నీ అనుచరులే పెద్దమ్మగడ్డ శ్మశానవాటికను కూల్చుతే నువ్వు చోద్యంచూశావు.. కానీ నేను పెద్దమ్మ గడ్డ శ్మశానవాటిక కూల్చివేసిన దోషులపై కేసు నమోదు చేయించానని నాయిని అన్నారు. అన్న పేరుతో రాజకీయ పబ్బం గడిపిన నీచ చరిత్ర వినయ్ దని, చేసిన పనిని మాత్రమే చెప్పుకునే స్వభావం నా తల్లితండ్రుల నుంచి నేర్చుకున్నానని అన్నారు. నీ వికృత చేష్టల వల్ల ఈ రోజు ప్రణయ్ భాస్కర్ కుటుంబం ఆగం అయిన మాట వాస్తవమ్ కాదా అని ప్రశ్నించారు. ఏనుగు రాకేష్ రెడ్డి నాకు సమాధానం చెప్పే, అర్హత, అనుభవం లేదన్నారు. తనకు వ్యాపారాలు లేవని, పేదల అభ్యున్నతే తన లక్ష్యమని, వారి శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నానని నాయిని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలి, మామిండ్ల రాజు, గుంటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బిన్నీ లక్ష్మణ్, సయ్యద్ రజాలి, మొహమ్మద్ అంకుష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కన్నీటి నివాళి

- అనారోగ్యంతో కన్నుమూసిన టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్
- జర్నలిస్ట్ గా, సీనియర్ న్యాయవాదిగా, బలహీనవర్గాల నాయకుడిగా
- మానుకోట ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి

అక్షరదర్బార్, మహబూబాబాద్ : టీ పీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్‌కు ప్రముఖులు కన్నీటి నివాళులర్పించారు. జర్నలిస్ట్, సీనియర్ న్యాయవాదిగా, బలహీనవర్గాల నాయకుడిగా మహబూబాబాద్ ప్రాంతంలో ఉదయ్ చందర్ సుపరిచితులు. గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మహబూబాబాద్‌లోని నివాసానికి భౌతికఖాయం తరలించగా వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శంచారు.

వేం నరేందర్ రెడ్డి నివాళి..

చుక్కల ఉదయ్ చందర్ గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక సలహాదారు వేం నరేందర్ రెడ్డి మృతుడి నివాసానికి వెళ్లి పూలమాలలతో నివాళులు అర్పించి చుక్కల ఉదయ్ చందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమ దంపతులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, టీ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు నివాళులర్పించారు.

కవితకు అస్వస్థత

దవాఖానలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ
రేపటి బతుకమ్మ ఉత్సవాలకు హాజరవుతారా..లేరా..?
పార్టీ శ్రేణులు, అభిమానుల్లో ఉత్కంఠ

అక్షరదర్బార్, హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దవాఖానలో చేరారు. అనారోగ్య సమస్యలతో బాధపడ◌ుతున్న ఆమె మంగళవారం ఉదయం గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారు. ఆమెకు వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న సమయంలో కవిత గైనిక్ సమస్యలు, తీవ్ర జ్వరంతో పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. గతంలో ఢిల్లీలో ఎయిమ్స్ లో వైద్య పరీక్షలు నిర్వహించగా గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అవే సమస్యలతో మరోసారి ఆస్పత్రిలో చేరారు. రేపటి నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కవిత పాల్గొంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఈ సమయంలోనే వైద్య పరీక్షల కోసం కవిత ఆస్పత్రిలో చేరడంతో ఆమె అభిమానులు, పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

నరేశ్ రెడ్డికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

- ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్, హరీష్ రావు ఆరా..
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నేతలు

అక్షరదర్బార్, హైదరాబాద్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డోర్నకల్ నియోజవర్గ నేత నూకల నరేష్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రిసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ నేతలు దవాఖానకువెళ్ళి ఆరోగ్య పరిస్థితిపై నరేశ్‌రెడ్డి తనయుడు అభినవ్ రెడ్డిని అడిగి తెలుసుకొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నరేశ్‌రెడ్డిని పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బిందు, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నూకల శ్రీరంగారెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

వెలగని వీధి దీపాలు

రేపటి నుండి బతుకమ్మ వేడుకలు ప్రారంభం
అంధకారంలో కాటారం మండల కేంద్రం
వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

అక్షర దర్బార్,కాటారం : బుధవారం నుండి ప్రారంభం కానున్న బతుకమ్మ వేడుకల కోసం కాటారం మండలకేంద్రంలో అధికారులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాటారంలో వీధి దీపాలు లేక చీకట్లోనే బతుకమ్మ ఆడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆయా కాలనీల్లో కరెంట్ స్తంభాలకు కరెంట్ బుగ్గలు పెట్టాల్సింది ఉండగా గ్రామ పంచాయితీ సిబ్బంది తమకేం తెలియదని నిర్లక్ష్యపు సమాధామిస్తున్నట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. కరెంట్ బుగ్గలు అమర్చడానికి సిబ్బంది లేరని కావాలంటే బల్బ్ లు ఇస్తామని మీరే ఎక్కి పెట్టుకోండని పంచాయతీ అధికారి బుకాయిస్తున్నట్లు మహిళలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హాజరైన పార్టీ నాయకులు,కార్యకర్తలు

హైడ్రా పేదల జోలికి రావొద్దు

- పేదలకు అండగా ఎర్రజెండా..
- చెరువులు, కుంటలను ఆక్రమించిన పెద్దల కట్టడాలు కూల్చాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- వరంగల్ లో ఇండ్లను క్రమబద్ధీకరించాలని సదస్సు

అక్షరదర్బార్, వరంగల్: హైడ్రా పేదల జోలికి పోవద్దని, హైడ్రా పేరుతో పేదలను భయాందోళనలకు గురిచేయడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ లో గల అబ్బాస్ ఫంక్షన్ హాల్ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పేదల ఇండ్ల స్థలాలను క్రమబద్దీకరించాలని సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే. బాష్ మియా అధ్యక్షత వహించగా కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైడ్రా ప్రభుత్వ భూములను, చెరువులు, కుంటలను ఆక్రమించిన పెద్దల కట్టడాలను కూల్చాలని, పేద, మధ్య తరగతి వర్గాలను ఇబ్బంది పెట్టరాదని అన్నారు. రాష్ట్రంలో చెరువులు, కుంటల వివరాలపై శ్వేతపత్రం ప్రకటించాలని, వాటిలో పరిరక్షించాల్సిన స్థలాలలో పేదల నివాసాలు ఉంటే వారికి ప్రత్యామ్నాయం చూపాలని సూచించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పులు చేసి అన్నిరకాల అనుమతులు తీసుకుని ఇల్లు కట్టుకుంటే కూల్చడం సరికాదని, వారికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కబ్జాలకు గురవుతున్న భూములను పరిరక్షించి పేదల పరం చేసిన ఘనత సీపీఐదని, తాము లక్షలాది మందికి ఇండ్ల స్థలాలను ఇప్పించామని అన్నారు. హైడ్రా పేరుతో అలాంటి పేదల జోలికి పోవద్దని, వరంగల్ నగరంతో సహా రాష్ట్రంలో ఎక్కడికి హైడ్రా వచ్చినా పేదలు అడ్డుకుంటారని హెచ్చరించారు. ఈ ఏడాదితో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్నదని, అనేక పార్టీలు ఆవిర్భవించి కాలగర్భంలో కలిసి పోయినా పేద ప్రజల అండతో సిపిఐ నిలబడిందని అన్నారు. సీపీఐ వందేళ్ల ఆవిర్భావం సందర్భంగా జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు, ఆ సందర్భంగా 5 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని, వరంగల్ నుండి పదివేల మంది కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కనీస వేతనాన్ని అమలు చేయాలి

ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ చంద్రగిరి శంకర్

అక్షర దర్బార్, భూపాలపల్లి: కాంట్రాక్టు కార్మికులకు 5000 బోనస్ ఆశ చూపించి కనీస వేతన అమలును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ చంద్రగిరి శంకర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులందరికీ పండగ బోనస్ ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మంత్రిపై ట్రోలింగ్ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

అక్షర దర్బార్, మహాదేవపూర్:తెలంగాణ అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ పై సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్న వ్యక్తులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్న కొండ సురేఖ జిల్లా పర్యటనకు వెళ్ళినప్పుడు మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేనేత కార్మికులు నుప్పులతో చేసిన దండను ఆమె మెడలో వేసి నేతన్నల సమస్యలు వివరించగా దానిని కొంతమంది సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేసి అసభ్యకరంగా మార్చారని వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో సంధ్యారాణి ప్రతిభ

అక్షర దర్బార్,మహాదేవపూర్: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని సూరారం గ్రామానికి చెందిన లేళ్ళ సంధ్యారాణి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. లేళ్ల సమ్మయ్య బానక్క పెద్ద కుమార్తె సంధ్యారాణి డీఎస్సీ ఫలితాల్లో భూపాలపల్లి జిల్లాలో ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపికైంది. ఎస్ఏ హిందీ సబ్జెక్టులో 9వ ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ హిందీ సబ్జెక్టులో 13వ ర్యాంకు సాధించింది. ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన సంధ్యారాణిని గ్రామస్తులు అభినందించారు.

కాటారం సబ్ డివిజన్ లో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

అక్షర దర్బార్,కాటారం : కాటారం సబ్ డివిజన్ మండలాలైన కాటారం, మహదేవపూర్ మండలాల్లో బుధవారం ఐటీ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటించనున్నారు. ముందుగా మహదేవపూర్ మండలకేంద్రంలోని సామాజిక వైద్యశాల ఎదురుగా ఏర్పాటుచేసే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కాటారం మండలకేంద్రంలో జరిగే మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొనడంతో పాటు కాటారం–భూపాలపల్లి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే ఇందిరా క్యాంటీన్ ను ప్రారంభించనున్నారు. అక్కడి నుండి మంథని నియోజకవర్గకేంద్రంలోని శివ కిరణ్ గార్డెన్లో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు ముందుకు రావాలి

- రూరల్ సీఐ సర్వయ్య

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ

అక్షర దర్బార్, కేసముద్రం : ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలను చైతన్యవంతం చేయడంలో యువత ముందుకు రావాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రూరల్ సీఐ సర్వయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలో డ్రగ్స్,గంజాయి,మద్యపానం వంటి వ్యసనాలకు యువత ఆకర్షితులై వారి జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా వారిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలకు సమాజంలో చెడ్డ పేరు తీసుకువస్తున్నారన్నారు.విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజీజ్ బేగ్,ఎన్ఎస్ఎస్ పీవో మధు,స్టేట్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్,స్టేట్ ఉమెన్స్ సెల్ సభ్యురాలు వాణి,జనరల్ సెక్రెటరీ మడిపెద్ది సంధ్య,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్,కొనకటి మహేందర్ రెడ్డి,సందీప్ రెడ్డి కొనకటి,నరేష్ పొలుసాని విక్రమ్ రావు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న గంగాధరి సిద్ధూ

అక్షర దర్బార్,తొర్రూరు:తొర్రూరు జెడ్పీ హైస్కూల్ లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగాధరి సిద్దు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించి ఉత్తమ విద్యార్థులకు తీర్చిదిద్ది సమాజాభివృద్ధికి ఉపయోగపడే విధంగా తయారు చేయాల్సిన ఉపాధ్యాయురాలు ఇలా విద్యార్థిని గాయపరచడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేష్, సాయి, సుమన్, విక్కీ, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలను మరమ్మతు చేయించాలి

కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చిన సీపీఎం పట్టణ కమిటీ

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుండి వ్యవసాయ మార్కెట్ వరకు అలాగే పరకాల మెయిన్ రోడ్, వీధుల్లో వీధి దీపాలు వెలుగక చీకటి పడితే అంధకారం ఉంటుందని, మున్సిపల్ అధికారులు వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్, పట్టణ నాయకులు మడికొండ ప్రశాంత్, హేమంత్, ఈశ్వర్, సాయి తేజ, శివ, అరవింద్ పాల్గొన్నారు.

కమిషనర్ కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

రిజిస్ట్రార్ చాంబర్ లో సమావేశమై యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై ఆరా తీస్తున్న విజిలెన్స్ అధికారులు

- వర్సిటీలో విజిలెన్స్ అధికారుల దాడులు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలు,
- సీఐ రాకేష్ ఆధ్వర్యంలో సోదాలు
- రిజిస్ట్రార్ మల్లారెడ్డి గాయబ్..
- గతంలోనూ నోటీసులకు స్పందించని వైనం
- కీలకమైన ఫైళ్ళు ఇవ్వడంలో జాప్యం
- నేరుగా యూనివర్సిటీకి వచ్చిన అధికారుల బృందం
- ఇంచార్జీ రిజిస్ట్రార్ నరసింహచారి, ఫైనాన్స్ ఆఫీసర్ తదితరులతో భేటీ..
- మూడేళ్ళలో జరిగిన అక్రమాలపై విచారణ..
- మాజీ వీసీ రమేష్ ప్రమోషన్‌పై ఆరా..
- యూనివర్సిటీల ఉత్కంఠ రేపుతున్న పరిణామాలు

కేయూలో కలకలం

అక్షరదర్బార్, హన్మకొండ: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ దాడులు కలకలంరేపాయి. మాజీ వీసీ తాటికొండ రమేష్ అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడని గతంలో అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) బాధ్యులు, వివిధ విద్యార్థి సంఘాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, విజిలెన్స్ అధికారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించి మూడేళ్ళలో వీసీ రమేష్ చేసిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా నాలుగు నెలల నుండి అనేకసార్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. ఇప్పటి వరకు పలు కీలకమైన ఫైళ్ళు విజిలెన్స్ అధికారులకు అప్పజెప్పలేదు. ఈనేపథ్యంలోనే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్‌తో కూడిన బృందం మంగళవారం యూనివర్సిటీకి రావడం సంచలనం సృష్టించింది. రిజిస్ట్రార్ మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన చాంబర్‌లో అధికారులు కూర్చొని ఇంచార్జీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరసింహచారి, ఫైనాన్స్ ఆఫీసర్, ఆడిట్ అధికారులను పిలుపించుకొని మూడేళ్ళలో జరిగిన అక్రమాలపై ఆరా తీసినట్లు సమాచారం.

రమేష్ ప్రమోషన్ పై ఆరా..

యూనివర్సిటీ చట్టం, జీవో నెంబర్ 15 ప్రకారం సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ కోసం సెలెక్షన్ కమిటీలో ఖచ్చితంగా వీసీ చైర్మన్‌గా ఉండాలి. ఒకవేళ వీసీ అప్లికెంట్ అయితే ప్రభుత్వం ద్వారా నియమింపబడిన ఇంచార్జీ వీసీ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా ఉండేలా చూసుకోవాలి. అలా కాకుండా ప్రొఫెసర్ మల్లారెడ్డిని సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమించి రమేష్ సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ తీసుకున్నారని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటి ఆధారంగా విజిలెన్స్ అధికారులు సెలెక్షన్ కమిటీ ప్రొసీడింగ్స్ అడిగినట్లు సమాచారం. కాగా ఈ ఫైళ్ళు విజిలెన్స్ అధికారులకు ప్రొఫెసర్ మల్లారెడ్డి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం, అంతేకాకుండా ఈరోజు మల్లారెడ్డి విజిలెన్స్ వారికి అందుబాటులో లేకపోవడంతో అధికారులు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్టును విజిలెన్స్ అధికారులు తమ వెంట తీసుకెళ్లినట్టు సమాచారం.

ప్రాజెక్టుల పరిశీలన జరిగిందా..?

కాకతీయ యూనివర్సిటీలో ఆరుగురు ప్రొఫెసర్లకు సీడ్ మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు ఆర్డర్ తీసిన విషయం గతంలో వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీ లో పనిచేస్తున్న టీచర్లకు మైనర్ రిసెర్చ్ ప్రాజెక్టు కింద రూ. ఇరవై లక్షలు సీడ్ మనీ అందించడానికి అప్పటి వీసీ రమేష్ 2022 నవంబర్ 19న నోట్ అప్రోవల్స్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ నోట్ ఆధారంగా అదే నెల 21న ప్రతి సంవత్సరం కేవలం పది ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తామని, ప్రతి ప్రాజెక్టుకు రూ.రెండు లక్షలు కేటాయిస్తున్నట్లు, ప్రతి ప్రాజెక్టు రెండు సంవత్సరాలు కాల పరిమితి ఉంటుందని, ఆ తర్వాత ప్రాజెక్ట్ రిపోర్ట్ రీసెర్చ్ డెవలప్మెంట్ సెల్ డైరెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేనెల 24వ తేదీన ఆరుగురు ప్రొఫెసర్లకు మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులను సీడ్ మనీ నుండి మంజూరు చేస్తున్నట్లు విడివిడిగా మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆరుగురిలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన డా.టీ సవిత జ్యోత్స్న, కామర్స్ విభాగానికి చెందిన టీ. శ్రీనివాసరావు, డా. ఎస్ నరసింహచారి, కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఎం.వేణుగోపాల్ రెడ్డి, గణిత శాస్త్ర విభాగానికి చెందిన మల్లారెడ్డి, భూగర్భ శాస్త్ర విభాగానికి చెందిన మల్లికార్జున్ రెడ్డి వున్నారు. 21న ప్రాజెక్టుల సమాచారంతో రిజిస్ట్రార్ ఇచ్చిన ఉత్తర్వులకు 24 లోపల సమర్పిస్తే ఆ ప్రాజెక్టులను ఎవరు, ఎప్పుడు పరిశీలించి సెలెక్ట్ చేశారో వాటికి సంబంధించిన రిపోర్టును అందివ్వమని విజిలెన్స్ అధికారులు అడిగినట్లు సమాచారం.

అనుమానాలకు బలం..

వీసీకి దగ్గరగా వుండే అనూయాయుల పేరు మీద మంజూరు ఉత్తర్వులు ఉండడం, అంతేకాకుండా తన ప్రాజెక్టు మంజూరు ఉత్తర్వులపై తానే (అప్పటి రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావు) సంతకం చేసుకోవడం అనుమానాలకు తావిస్తుంది. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి ఉత్తర్వులు ఐ.క్యూ.ఎ.సి సెల్ నుండే వెలువడ్డాయి. ఐ.క్యూ.ఎ.సి సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ నరసింహచారి పేరుతో తనే డైరెక్టర్ గా వున్న సెల్ నుండి వెలువడిన ఉత్తర్వుల్లో తన పేరుతోనే వుండడం కూడా గమనించదగ్గ విషయం. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డికి అసలు ప్రాజెక్ట్ మంజూరు ఉత్తర్వులు తన పేరుతో వున్న విషయం కూడా తెలువదని సమాచారం. న్యాక్ అధికారులకు తప్పుడు ఫేక్ ప్రాజెక్టుల సమాచారం ఇచ్చిన మాజీ వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావులపై ఎటువంటి చర్యలు ఉండబోతున్నాయనే ఉత్కంఠ నెలకొంది.

వృద్ధులకు అండగా

డే కేర్ సెంటర్

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

అక్షరదర్బార్, హనుమకొండ : వయో వృద్ధుల సంక్షేమంలో భాగంగా డే కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని హనుమకొండ జిల్లా పరిషత్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ భవనాన్ని కలెక్టర్ హాజరై ప్రారంభించారు. వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లోని ఫిజియోథెరపీ యూనిట్‌తోపాటు వసతులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వయోవృద్ధులకు 20 రోజుల్లో డే కేర్ సెంటర్ ఏర్పాటు కావడం సంతోషకరంగా ఉందన్నారు. డే కేర్ సెంటర్ లో వయోవృద్ధులకు ఫిజియోథెరపీ సేవలు, లైబ్రరీ, ఆట వస్తువులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. డే కేర్ సెంటర్ ను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వయోవృద్ధులను కలెక్టర్ ప్రావీణ్య సన్మానించారు. జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితా దేవి తదితరులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్ లో వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్